క్లుప్తంగా

'ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణ తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌ను విస్మరించిందని, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం పునరాలోచన చేయాలని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాగ్వానా, సభ్యులు వడ్డేపల్లి రాంచంద్రయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ యువజన ప్రధాన కార్యదర్శి దీపక్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దేవకర్ణ, కార్యదర్శి బబిత, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు జూపాక సుధీర్ ఉన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌యాపలోని రోడ్డుకు మరమ్మతులు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణం కాసిపేటలో చేపట్టాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు కలెక్టర్‌ను కలిసి రోడ్డు సమస్య వివరించామన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఓరియంట్ సిమెంట్ కంపెనీ వారితో మాట్లాడి మరమ్మతులకు ఆదేశించినట్లు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ విక్రంరావు, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్, మాజీసర్పంచ్ సత్తయ్య, నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'నిందితుడిని ఉరి తీయాలి'

చెన్నూర్: జైనూర్ మండల దేవగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నం చేసిన నిందితుడిని ఉరి తీయాలని కోరుతూ స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ రవీందర్‌కు శుక్రవారం ఆదివాసీ సంఘం నాయకులు జేక శేఖర్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సంఘం నాయకులు జయిలు, మాంతయ్య, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్/కోటపల్లి: షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్‌కు సంబంధించి జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల ఐదు దుకాణాలను నెలవారి అద్దె ప్రతిపాదికన కేటాయించేందుకు షెడ్యూల్డ్ కులాల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఈనెల 25 సాయంత్రం 5 గంటల్లోపు నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయల సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

జిజ్ఞాస ప్రయోగాలు వినూత్న ఆలోచనలకు మూలం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

చెన్నూర్: విద్యార్థులలో వినూత్న ఆలోచనలకు జిజ్ఞాస ప్రయోగాలు తొలిమెట్టు అని మహాత్మ జ్యోతిబాపూలే ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో జిల్లాస్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్‌లు పాఠశాలను సందర్శించి జిజ్ఞాస ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సోలార్ వ్యవస్థ, పెరిస్కోప్, అయస్కాంతం ఆకర్షణ, గ్రహణం ఏర్పాటు అంశాలను ప్రయోగపూర్వకంగా వివరించారు. ఉపాధ్యాయులు శ్రీలత, రాధిక, సుష్మ, సునీల్, జ్యోతిర్మయి, రాణి, రాజేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కొత్త గనుల కోసం ఉద్యమించాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్తగనుల కోసం ఉద్యమించాలని సీపీఎం నాయకులు తెలిపారు. శుక్రవారం పార్టీ నాయకులు బొగ్గు బ్లాకుల సాధన కోసం సీసీసీలో సంతకాల సేకరణ చేపట్టి కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సింగరేణిలో పాత గనులు మూతపడుతున్నాయని, వాటి స్థానంలో కొత్త గనులు రావడం లేదన్నారు. కొత్త గనుల కేటాయింపుల్లో కేంద్రం అనుసరిస్తున్న విధానాలు సంస్థ మనుగడను ప్రశ్నార్థకంలో పడేశాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విఫలమైందని విమర్శించారు. నాయకులు గంగాధర చారి, దమ్మల రాములు, పి.రాములు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



దండేపల్లి: కుంకుమపూజలు చేస్తున్న భక్తులు



లక్సెట్టిపేట: కుంకుమపూజ నిర్వహిస్తున్న భక్తులు



తాండూర్: కిష్టంపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద..



మంచిర్యాలఅర్బన్: గౌతమేశ్వరకాలనీలో..

భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు



బెల్లంపల్లి: వడ్డిస్తున్న ఏసీపీ రవికుమార్



వేమనపల్లి: అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని ఆయా గ్రామాల్లో నెలకొల్పిన గణనాథుల వద్ద శుక్రవారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం గణేశ్ మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యజ్ఞం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఎస్టీపీపీ జీఎం రాజశేఖర్‌రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ఓసీపీ పీవో శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. భీమారం మండల కేంద్రంలోని హైస్కూల్ వినాయక మండలి వద్ద 108 రకాల నైవేద్యాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు హైటెక్‌సిటీ శివాలయం, పాత మంచిర్యాల 8వ వార్డులోని వినాయక మండపాల్లో గణేశుడిని దర్శించుకున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మంత్రి పదవి దక్కాలని నెన్నెల మండలం కొత్తూర్ గ్రామకమిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 18 వార్డు షంషీర్ నగర్ బస్తీ వినాయకుడి మండపంలో ఏసీపీ ఎ.రవికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో కమాండెంట్ వెంకటరాములు దంపతులు పూజలు నిర్వహించారు.



భీమారం: 108 రకాల నైవేద్యాలతో పూజలు చేస్తున్న భక్తులు



కాసిపేట: ముత్యంపల్లిలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



భీమిని: జన్కాపూర్‌లో కుంకుమ పూజలో భక్తులు



శ్రీరాంపూర్ ఓసీపీలో..



గుడిపేట బెటాలియన్‌లో కమాండెంట్ దంపతులు..



మంచిర్యాలఅర్బన్: అన్నప్రసాద కార్యక్రమంలో దివాకర్‌రావు



మందమర్రిరూరల్: పూజలో పాల్గొన్న తహసీల్దార్, ఎస్సై



నెన్నెల: అన్నదానం చేస్తున్న జలీల్



కోటపల్లి: మట్టి వినాయకుడిని దర్శించుకుంటున్న సలీం

నీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మహిళలు శుక్రవారం కాలనీ రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈమేరకు మహిళలు మాట్లాడుతూ రెండు బోరుబావులు ఉన్నా పనిచేయడం లేదన్నారు. సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మంచినీటి సమస్య పరిష్కరించాలని, లేదంటే జాతీయ రహదారిపై ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా 5.0 ఎంవీఏ పీటీఆర్‌ను అమర్చనున్నట్లు తెలిపారు. బజారు ఏరియాలోని రోడ్ నంబర్ 2, 3, 4, కన్నాల బస్తీ, పోస్టాఫీసు బస్తీ, ఫుట్‌బాల్ గ్రౌండ్ బస్తీ, పెద్దనపల్లి, కాల్‌టెక్స్, గాంధీనగర్, గంగారాంనగర్, టేకుల బస్తీ ఏరియాలలో నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి 1గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట 33/11 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఎం ఆఫీస్, యాపల్, కేకే 2, ఊరు మందమర్రి, ఎర్రగుంటపల్లె, మార్కెట్, దీపక్‌నగర్, శ్రీపతినగర్, దొర్లబంగ్లాస్, పాలచెట్టు, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వర్‌రావుపల్లె, నార్లాపూర్, బొక్కలగుట్ట, సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని లక్సెట్టిపేట ఏడీఏ ప్రభాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 11:30 వరకు అంతరాయం ఉంటుందని సహకరించాలని కోరారు.

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్2 పరిధిలో ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్, ఏఈ జాన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు మార్కెట్ ఏరియా, జన్మభూమినగర్, జాఫర్‌నగర్, ఇక్బాల్ అహ్మద్‌నగర్, ఇందిరానగర్, ఇస్లాంపూర, హైటెక్‌సిటీ, సుభాష్‌రోడ్, ఎంసీసీ ఏరియా, అండాళమ్మ కాలనీ, గ్రీన్‌సిటీ, లక్ష్మీనగర్, వికాస్‌నగర్, మారుతినగర్, రాళ్లపేట పరిధిలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

'ఉపాధిహామీ' గ్రామాలకు వరం

జైపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధిహామీ పథకం వరమని, జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి 100 రోజులు నిండేవిధంగా పనులకు రావాలని ఎంపీవో శ్రీపతి బాపురావు తెలిపారు. మండలంలోని ఇందారం గ్రామంలో ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. ఏపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

ఓటర్ లిస్టు ప్రదర్శన..

ఇందారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటర్ లిస్టును ప్రదర్శించారు. డీఎస్‌పీవో ధర్మరాణి, ఎంపీవో శ్రీపతిబాపురావు, పంచాయతీ కార్యదర్శి సుమన్ ఉన్నారు.

కొండచిలువ హతం



హతమైన కొండ చిలువ

భీమారం: మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ ప్రాంతంలో శుక్రవారం ఒక ఇంట్లోకి వెళ్లిన పది అడుగుల కొండచిలువను స్థానికులు హతమార్చారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోటు మహేశ్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి వెనుక గల పెరడు నుంచి ఇంట్లోకి కొండ చిలువ ప్రవేశించింది. దీంతో స్థానికులు కర్రలతో కొండ చిలువను బయటకు పంపే ప్రయత్నం చేశారు. అయినా ఫలించకపోవడంతో కర్రలతో కొట్టి హతమార్చారు.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి

తాండూర్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమాలను భక్తులు శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ కుమారస్వామి అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగే ఊరేగింపులో విద్యుత్ ప్రమాదాలు, చెరువుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సై కిరణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజన్ కుమార్, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భీమిని: గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ కుమార స్వామి అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సై విజయ్ కుమార్, ఏఎస్సై రంగు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారయణ, మహేశ్ గౌడ్, ఎల్లాగౌడ్ ఉన్నారు.



తాండూర్: మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

'ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు'

బెల్లంపల్లిరూరల్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీ బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు రమణ, అశోక్, నాయకులు దేవదాస్, రవీందర్, తిరుపతి, శ్రీకాంత్, కిష్టయ్య, బాబు, చంద్రయ్య, గోపాల్, భూమేశ్వర్, శంకర్, సజ్జీవన్, మనోహర్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని ఎంసీపీఐ(యూ) నాయకులు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏచూరి సంతాపసభ నిర్వహించారు. ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడని కొనియాడారు. ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేశ్, పట్టణ కార్యదర్శి రమేశ్, సతీశ్, ఆకాశ్, వేణు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న నిర్వహించే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు బ్రహ్మానందం, శ్రీనివాస్, రామన్న, దేవరాజు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పాతమంచిర్యాల: రజకుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, పట్టణ అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యూనివర్సిటీకి ఐలమ్మ పేరు ప్రకటించడం, ఆమె మనువరాలు శ్వేతకు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కే.పోషం, సలహాదారు నేరేళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు ధర్మయ్య, వార్డు సభ్యులు కృష్ణ, సమ్మయ్య, శేఖర్, మల్లేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం కోసం చెత్త తొలగింపు

భీమారం: మండల కేంద్రంలో సోమవారం జరుగనున్న వినాయక నిమజ్జనం కోసం కొత్త చెరువు వద్ద శుక్రవారం గ్రామపంచాయితీ కార్మికులు చెత్త తొలగించారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలోనే పెద్దఎత్తున జరిగే నిమజ్జనం సాఫీగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాత్రి వేళ లైటింగ్ సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా హిందీ దివస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, హిందీ ఉపాధ్యాయులు నీలేశ్‌కచ్‌వా, ఆర్.సికిందర్‌ల ఆధ్వర్యంలో హిందీ దివస్ వేడుకలు జరిపారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, నాటకాలు అలరించాయి. హిందీ భాష ఔనత్యాన్ని చాటేలా ఇచ్చిన ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

'అమ్మ కోసం మొక్క' కార్యక్రమంపై సమీక్ష

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి శుక్రవారం 'అమ్మ కోసం మొక్క' అనే కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వనమహోత్సవం కింద నాటిన మొక్కల సంరక్షణపై చర్యలు తీసుకోవాలని, కొత్తగా నర్సరీ స్థలాలు ఎంపిక చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, గ్రామ పంచాయితీ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

భీమారం: హరీశ్‌రావు పిలుపు మేరకు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు మధునయ్య, రాము, లక్ష్మణ్, బుక్యా రాజ్‌కుమార్, తిరుపతిలను పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కోటపల్లి: హైదరాబాద్ వెళ్తున్న కోటపల్లి బీఆర్‌ఎస్ నాయకులను ఎస్సై రాజేందర్ ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విద్యాసాగర్ మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపుమేరకు శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తున్న నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. సంపత్, నూతన్, సంతోష్ ఉన్నారు.

'కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి హేయమైన చర్య'

జన్నారం: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని మండల బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుల్వ జనార్దన్, జిల్లా అధికార ప్రతినిధి భరత్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ వినయ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 24వ వార్డు అంబేద్కర్ రడగంబాల బస్తీలో శుక్రవారం అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు డి.సౌజన్య, శిరీష రోగులను పరీక్షించి మాత్రలు పంపిణీ చేశారు. జ్వరాల బారిన పడిన రోగుల రక్త నమూనాలు సేకరించారు. శిబిరాన్ని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్ సందర్శించారు. సిబ్బంది ప్రవంతి, వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని గత్రావుపల్లిలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి సమీప గ్రామాల ప్రజలు హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వారికి మందులు పంపిణీ చేశారు. కంపెనీ ప్రెసిడెంట్ సత్యవ్రతశర్మ, యూనిట్ హెడ్ బాలగిరిధర్, సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, వైద్యులు ఝాన్సీ, నవీన్, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

'కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

పాతమంచిర్యాల: అరికెపూడి గాంధీపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని శుక్రవారం జిల్లా కేంద్రంలో కమ్మ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వడ్డే వినయ్‌కుమార్ అన్నారు.